# హేలగా.. ఆనంద డోలగా...

~ టి. శ్రీవల్లీ రాధిక



**కథ:** హేలగా.. ఆనంద డోలగా...

**రచన:** టి. శ్రీవల్లీ రాధిక

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: డిసెంబరు 2013

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=544

©Author.
**What can you do with this document?**
Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use
**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

‘అల్లిబిల్లిగా పెనవేసుకున్న లతలూ తీగలతో అగమ్యంగా కనిపిస్తోంది ఆ ప్రదేశం. నేలంతా రాలిపడిన ఎండుటాకులు.. పగలో, రాత్రో తెలియని అస్పష్టమైన వెలుతురు. అయినా తనకి దారి సుస్పష్టంగా తెలిసినట్లే చక చకా నడిచి పోతూ వుంది తను.

ఒకవేళ దారిలో ఏ ప్రమాదమైనా వున్నా అది లయగా పడుతున్న తన అడుగులకి అడ్డం రాదనీ.. అదే లయతో ప్రక్కకి తప్పుకుంటుందనీ తెలిసినదానిలా సాగిపోతోంది.

అల్లంత దూరంలో ఏమిటది! చెట్ల మధ్య.. వరుసగా స్థంభాలతో ఓ మండపం. చిన్నదా! పెద్దదనాలా! కళ్ళు చూడగలిగినంత! మనసు పట్టగలిగినంత! ఒక అడుగు.. మరో అడుగు.. వెనుక లీలగా కనిపించిన తలుపులు.. వాటి వెనుక మరింత లీలగా తోచిన సీతారామ లక్ష్మణుల విగ్రహాలు.. వారి చిరునవ్వులు.. వరుసగా మూడు మెరుపులు.. మరుక్షణం కళ్ళు మిరుమిట్లు గొలిపే కాంతులు.. గణగణమంటూ గంటల మ్రోతలు...’

ఉలిక్కి పడి కళ్ళు తెరిచింది ధన్య. ఏదో బస్ స్టాప్ లో ఆగి వుంది బస్.

బస్ బయటా లోపలా కూడా లైట్లు వెలుగుతున్నాయి. రణగొణ ధ్వనులు.

షాల్ ఒకసారి సర్దుకుని, చలికి ముడుచుకుంటూ టైం చూసింది ధన్య. రెండయింది. ఇంకొక మూడుగంటల ప్రయాణం. తెల్లవారక ముందే తనని గమ్యం చేరుస్తుంది బస్.

మెలకువ వచ్చేసరికి కళ్ళముందు కదలాడిన దృశ్యం మళ్ళీ మనసులో మెదిలింది.

ఇపుడే కాదు, ఇదివరకు చాలాసార్లు వచ్చింది ఆ కల ధన్యకి.

‘ఆ రామాలయంతో తనకేమన్నా అనుబంధం వుందా! అలాంటిది ఎపుడయినా చూసిందా తను! ఇదివరకు చాలా తరచుగా వచ్చేది ఈ కల. ఈ మధ్య కొన్నాళ్ళుగా రావడం లేదు. కానీ ఇదివరకుకీ, ఇప్పటికీ ఏదో తేడా వుంది... ఏమిటది!’

ధన్య ఆలోచిస్తూండగానే బస్ లో లైట్లు ఆరిపోయాయి. బస్ మళ్ళీ బయల్దేరింది. కళ్ళు మూసుకునేందుకు ప్రయత్నిస్తుంటే హటాత్తుగా ధన్యకి స్ఫురించింది. ఈ సారి కలలో తను.. తను పూర్తిగా నృత్యాలంకరణలో వుంది!

★★★

ధన్య ఒకసారి టైం చూసుకుని లాప్ టాప్ మూసేసింది. సీట్లో నుంచి లేచి సంజయ్ కాబిన్ వైపు నడిచింది. అటు తిరిగి నిలుచుని వున్నాడు సంజయ్.. రెండు చేతులూ పాంట్ జేబుల్లో పెట్టుకుని ఎదురుగా వున్న అద్దంలో నుంచి ఆకాశాన్ని చూస్తూ..

అతని భుజాలూ..నడుమూ.. గాలికి ఎగురుతూన్న జుట్టూ.. శ్రద్ధగా చెక్కిన శిల్పంలా వున్నాడు.

ఒక్క క్షణం కళ్ళు తిప్పుకోలేనట్లు చూసి చిన్నగా తలుపు మీద తట్టింది ధన్య. వెనుతిరిగి చూసి నవ్వాడు సంజయ్. “హాయ్” అన్నాడు.

“ఏంటలా శూన్యంలోకి చూస్తూ నిల్చున్నావ్!” అతని చిరునవ్వు తనలో కలిగించిన పులకింతని దాచుకుంటూ అల్లరిగా అడిగింది ధన్య.

“ఫైల్ కాపీ చేస్తున్నాను.” లాప్ టాప్ లోనుంచి పెన్ డ్రైవ్ వేరు చేసి “వెళ్దామా!” అన్నాడు.

ఇద్దరూ బయటికి వచ్చారు. కారు ఆఫీస్ గేట్ దాటేస్తూండాగా “ఎటు!” అన్నాడు సంజయ్.

“నిన్న వెళ్ళిన చోటికే. విషయం పూర్తిగా మాట్లాడుకోవాలిగా!” అంది ధన్య కొంచెం గంభీరంగా.

కారు వాళ్ళు తరచూ వెళ్ళే రెస్టారెంట్ లో ప్రవేశించింది. అందమైన ప్రదేశం అది.... చక్కటి పూల మొక్కల మధ్యలో ఆహ్లాదకరంగా వున్న వాతావరణం..

అన్ని టేబుల్స్ దగ్గరా రకరకాల జంటలు..

బాగా దూరంగా వున్న టేబిల్ దగ్గరకి వెళ్ళి కూర్చున్నారిద్దరూ. చిరు చీకట్లు ముసురుతున్నాయి.

“ఏం మాట్లాడాలి ధన్యా!” అనునయంగా అడిగాడు సంజయ్. “నిన్న నేనన్న మాటలకి నువ్వు నొచ్చుకున్నావు కదూ!”

“లేదు సంజయ్, నొచ్చుకోవడం కాదు.” తల అడ్డంగా ఊపుతూ చెప్పింది ధన్య. “నేనూ ఆలోచిస్తున్నాను.”

రెండు చేతులూ టేబిల్ మీద ఆనించి ఏదో వివరించబోతున్నట్లుగా ముందుకి వంగాడు సంజయ్.

అదే సమయంలో ఒక్కసారి చురుగ్గా తల ఎత్తి చాలా సేపట్నుంచీ ఎలా అడగాలో తెలీక యిబ్బంది పడుతున్న ప్రశ్నని తెగించి అడిగినట్లుగా అడిగింది ధన్య.

“నువు నన్ను డాన్స్ మానేయమనడానికి కారణం… నీ భార్య నలుగురి ముందూ నాట్యం చేయడం బాగుండదనీ .. అది అవమానకరమనీ అనుకోవడం వలన కాదు కదా!”

సంజయ్ ఒక్క క్షణం తదేకంగా ధన్య కళ్ళల్లోకి చూశాడు. ఆమె చేతిని తన రెండు చేతుల్లోకీ తీసుకుని “కాదు.. నిజంగా కాదు.” అన్నాడు నిజాయితీ అంతా గొంతులో ధ్వనించేలా.

ధన్య మొహం విప్పారింది. “నాకు తెలుసు.” అంది తను కూడా అతని చేయి పట్టుకుంటూ. “అయినా అడిగాను, క్షమించు.” అంది.

“లేదు, మంచి పని చేశావు. మనిద్దరం వేరు కాదు ధన్యా! క్షమించమని అడగకు. నువు నాలో ఒక భాగానివి అనుకుని, నాకు నేనే ఆ ప్రశ్న వేసుకున్నట్లుగా.. నాకు నిజంగా కలిగిన ఒక సందేహాన్ని నీ దగ్గర బయటపెట్టానంతే.

“నువు చిన్నప్పటినుంచీ చాలా శ్రద్ధగా డాన్స్ నేర్చుకున్నావు. నాకు తెలుసు.. నాట్యం చేయడమంటే నీకెంత యిష్టమో అది నీకెంతటి ఆనందాన్నిస్తుందో నువ్వు చెప్పావు. అయితే అంతే శ్రద్ధగా చదువుకున్నావు. ఇంజినీర్ వి అయ్యావు. ఇంత మంచి ఆర్గనైజేషన్ లో జాబ్ సంపాదించావు. ఇపుడు ఇక ఈ రెండింటిలోనూ ముందుకి వెళ్ళడం నీకు కష్టమవుతుందేమోననిపించింది నాకు. రేపు మనం పెళ్ళి చేసుకుంటే, బాధ్యతలు పెరిగితే మరింత స్ట్రెయిన్ కి గురవుతావేమోననిపించింది. అందుకే అన్నాను.. పోనీ ఇక డాన్స్ వదిలేయకూడదూ! అని. అంతే.”

ఆమె రెండు అరచేతులనీ తన చెంపలకి ఆనించుకుంటూ చెప్పాడు సంజయ్. “నువు దీని గురించి ఇంతగా వర్రీ అవాల్సిందేమీ లేదు ధన్యా! దీనికీ మన పెళ్ళికీ ఏ సంబంధమూ లేదు.

“ఏపనైనా చేసేటపుడు ఈ పని నేను ఎందుకు చేస్తున్నాను? అని ప్రతిసారీ ఆలోచించుకుంటాను నేను. నువ్వూ, నేనూ ఒకటే అనుకున్నాక నీ గురించీ అలాగే ఆలోచించాను. కానీ నాకు సమాధానం స్పష్టంగా తెలీలేదు. నాట్యం విషయంలో నువ్వు కాస్త ఆనందం కోసం

ఎక్కువ శ్రమ పడుతున్నావా! అసలది నిజంగా ఆనందమేనా! ఆనందమని నువ్వు అనుకుంటున్నావా! – అది అర్థం కాక నిన్ను అడిగాను, అంతే.” వివరిస్తున్నట్లుగా చెప్పాడు సంజయ్.

“వర్రీ అవడం లేదు సంజయ్.” చిన్నగా నిట్టూరుస్తూ చెప్పింది ధన్య. “నువు అడిగే వరకూ దీని గురించి నేనెపుడూ ఆలోచించలేదు. కానీ నువు అడిగాక నాకూ అవే ప్రశ్నలు వచ్చాయి. ‘నాకు నాట్యమెందుకు? నాట్యం నాకేమిస్తుంది?’ అన్నప్రశ్నలకి నాకూ సమాధానాలు స్పష్టంగా తెలియలేదు.” చెంపకి చేయి చేర్చి సాలోచనగా సంజయ్ వైపు చూస్తూ చెప్పింది ధన్య.

‘నాలుగు రోజుల క్రితం పుట్టిన ప్రశ్నలూ.. ఆ ప్రశ్నలకి సమాధానాన్ని అన్వేషిస్తూ ఓ కొత్త ప్రదేశానికి తన ఈ ప్రయాణం! ఎంత చిత్రంగా వుంది!’ కదలిపోతున్న బస్‌లో నుంచి బయటి చీకటినీ, వెన్నెలనీ గమనిస్తూ చిన్నగా నవ్వుకుంది ధన్య.

★★★

తెల తెలవారుతూండగా ఆ చిన్న వూర్లో బస్ దిగింది ధన్య. బ్యాగ్ లో నుంచి అడ్రస్ వ్రాసుకున్న పేపర్ తీసి ఒకసారి చూసుకుంది. మెల్లగా నడవసాగింది.

అత్యంత అధునాతనంగా వున్న దుస్తులూ.. ఖరీదైన బ్యాగూ.. ఆ అందమైన అమ్మాయి రిక్షా వద్దంటూ చకచకా నడిచి పోతుంటే కొంత ఆశ్చర్యంగా చూస్తూండి పోయారు అక్కడి జనం. దూరంగా బాలికల పాఠశాల అన్న బోర్డు కనబడగానే... “అమ్మయ్య! మేడం చెప్పినట్లే వచ్చేశాను.” అనుకుంది ధన్య సంతోషంగా.

మరో నాలుగడుగులు వేస్తే.. నాలుగు రోడ్ల కూడలి లో ఆంజనేయస్వామి విగ్రహం. అక్కడ కుడి ప్రక్కకి తిరిగి ఆ వీధి చివరిదాకా నడిస్తే అక్కడ ఆ యిల్లు.

‘ఇంటి వైపుకి తిరిగి నిలుచుంటే మేడం చెప్పినట్లే ఇంటికి వెనుక వైపు దూరంగా కొంచెం ఎత్తులో గుడి కనిపిస్తోంది. వేణుగోపాలస్వామి గుడి అట!’ అదే తనకి కావలసిన యిల్లు అని అర్థమయింది ధన్యకి.

ఇంటికీ గేట్ కీ మధ్యనున్న ఖాళీ స్థలంలో గన్నేరు, పారిజాతం, మందారం, నందివర్ధనం.. రకరకాల పూల చెట్లు... వాటి వెనుక చిన్న యిల్లు. మళ్ళీ ఇంటికి వెనుక వైపు పెరట్లోనూ ఇలాగే

మొక్కలూ, కూరగాయల పాదులూ వున్నట్లున్నాయి. వరుసగా వున్న నాలుగు గుమ్మాలలోనుంచి వెనుక గుమ్మానికి ఎదురుగా వున్న తులసి కోట కనిపిస్తోంది.

ధన్య గేటు తెరుచుకుని మెల్లగా లోపలికి అడుగుపెడుతూండగా కనబడింది ఆమె. ఒక తాడు తీసుకుని వెనుక గుమ్మంలో నుంచి వడివడిగా పెరట్లో ఒక మూలగా పెట్టి వున్న రోలు వైపు వెళ్తూ.

ఆ రోటి దగ్గర ఒక్క క్షణం ఆగి "కృష్ణా" అంది ఆవిడ. ఆ తర్వాత వంగి ఆ తాడుని చుట్టూ తిప్పి ముడులు వేయసాగింది.

ధన్య అవాక్కయినట్లుగా నిలబడిపోయింది. "ఏం చేస్తోందావిడ! ఏం చూస్తోంది తను!" ఒక్క క్షణం అర్థం కాలేదు. 'కృష్ణుడిని రోటికి కట్టేస్తోందా!' తను ఎన్నో సార్లు అభినయించిన యశోదా కృష్ణ నాట్యాన్ని ప్రత్యక్షంగా చూస్తున్నట్లుగా వుంది ధన్యకి. ఆమె నడక.. ఆ తీరు.. అవును.. ఆమె యశోదే. అదిగో అక్కడ.. అక్కడ నిలుచున్నది బాలకృష్ణుడే. ఒక క్షణం పకపకా నవ్వుతూ.. అంతలోనే బిక్క మొహం పెడుతూ.. వద్దమ్మా, వద్దమ్మా అని బ్రతిమలాడుతూ.. దొంగ ఏడుపులు ఏడుస్తూ.

గుడిలోనుంచి ఘంటానాదం వినబడడంతో ఉలిక్కిపడింది ధన్య. అపుడే గమనించింది ఆవిడ ధన్యని. "ఎవరమ్మా!" అంది మెల్లగా లేచి నిలుచుంటూ.

ఆ ప్రశ్నకి సమాధానం చెప్పకుండా "ఏం చేస్తున్నారు మీరు!" అంది ధన్య.

అంటూండగానే గమనించింది. అక్కడ బాలకృష్ణుడు లేడు. ఆవిడ యశోద కాదు. రోలు ప్రక్కగా వున్న చిన్న మొక్క పక్కకి వంగిపోతే దానిని నిటారుగా నిలబెట్టి తాడుతో కడుతున్న ఆవిడ.. ఆవిడ.. రుక్మిణి గారు!

స్పృహలోకి వచ్చినట్లుగా చూసి ఆవిడకి నమస్కరించింది ధన్య. బ్యాగ్ లో నుంచి ఉత్తరం తీసి యిచ్చింది "దీపా మేడం పంపారండీ." అంటూ.

ఆవిడ హాయిగా నవ్వి ఆ ఉత్తరం అందుకుంటూ "లోపలికి రామ్మా!" అన్నారు.

ధన్య మొహం కడుక్కుని వచ్చేసరికి ఉత్తరం చదివినట్లున్నారు ఆవిడ. వంట గదిలో శబ్దాన్ని బట్టి కాఫీ పెడుతున్నారని గ్రహించింది ధన్య. ఆప్రక్కనే పూజ గదిలో కూర్చుని జపం చేసుకుంటూన్న ఆవిడ భర్తనీ అప్పుడే గమనించింది.

‘దీపా మేడం వయసే వుంటుంది బహుశా ఈవిడకి. మేడం ఎప్పుడూ పూర్తి మేకప్ లో ఉంటారు. ఈవిడకి మేకప్ లేదు కానీ మిగతా అలంకారమంతా దాదాపుగా అలాగే వుంది. కొప్పు, పూలు, చేతినిండా గాజులు.. తళతళలాడే ముక్కుపుడక.. పెద్ద బొట్టు.’

ఆవిడ చుట్టూ.. ఆ యింటి నిండా ఏదో దివ్యత్వం..

తను ఏ ప్రశ్నలకి సమాధానం కోసం వచ్చిందో అవన్నీ మర్చిపోయింది ధన్య. స్నానం.. భోజనం.. పనులన్నీ ఏదో మైకంలో వున్నట్లుగా పూర్తి చేసింది. అన్నం తినగానే ఆగకుండా ఆవులిస్తుంటే “కాసేపు పడుకుంటావా!” అన్నారావిడ.

ధన్య నిద్ర లేచేసరికి వాకిట్లో బిలబిల్లాడుతూ అమ్మాయిలు. రుక్మిణి గారు ధన్యకి కాఫీ యిచ్చి వాళ్ళకి పాఠం చెప్పేందుకు కూర్చున్నారు.

ధిత్తా.. ధిమితా.. ధిమితా కిటతక.. తళాంగు తకధిమి.. తక తథిగిణతోం..

పిల్లలకి నాట్యం నేర్పుతున్న రుక్మిణి గారినే చూస్తూ రెండు రోజుల క్రితం తాను దీపా మేడం దగ్గరికి వెళ్ళడాన్ని గుర్తు చేసుకుంది ధన్య.

ఆరోజు ధన్య వెళ్ళేసరికి యిలాగే క్లాస్ జరుగుతోంది అక్కడ. అది సాధారణమైన నాట్యాలయం కాదు. ప్రపంచ ప్రఖ్యాతి వుంది దానికి. దీప తన జీవితమంతా నాట్యానికే అంకితం చేసిన వ్యక్తి. పద్మశ్రీ లాంటి పురస్కారాన్ని పొందిన నాట్య కళాకారిణి. బాగా చిన్నతనం నుంచీ అక్కడ నాట్యాన్ని అభ్యసించిన విద్యార్థినిగా, దీపా మేడం ప్రియ శిష్యురాలిగా ధన్య అక్కడి టీచర్లందరికీ పరిచయమే. అందరినీ చిరునవ్వుతో పలకరిస్తూ నేరుగా దీప ఆఫీస్ రూం లోకి వెళ్ళింది ధన్య.

ధన్యని ఎంతగానో ప్రోత్సహిస్తారు ఆవిడ. “అందర్లాగా కాదు నువ్వు. నాట్యం మానకు.” అని పదే పదే చెప్తారు.

ధన్యని చూస్తూనే నవ్వి “కూర్చో” అన్నారు.

కూర్చుంటూనే సూటిగా అడిగింది ధన్య. “నాట్యం మనిషికి ఏం యిస్తుంది మేడం! అసలు ఏ కళ అయినా మనిషికి ఏం యిస్తుందంటారు?”

“నేను నా జీవితంలో పొందినవి అన్నీ నాట్యం తోనే పొందాను ధన్యా!” నింపాదిగా చెప్పింది దీప.

అవును. ధన్యకి తెలుసు. ఆవిడ ఎన్నో ఇంటర్వ్యూలలో చెప్పిన విషయమే అది. ధన్య ఎన్నో సార్లు శ్రద్ధగా విన్నదే.

కానీ అది చాలడం లేదు ఆమెకి. "అది కాదు మేడం! నేను నాట్యాన్ని వదిలిపెట్టకుండా సాధన చేస్తే ఏం సాధిస్తానంటారు? మీలాగా పద్మశ్రీ అవుతానా ఒకనాటికి?"

"తప్పకుండా అవుతావు" అన్నారు ఆవిడ. "అంతకన్నా ఎక్కువే సాధిస్తావు నువ్వు. నీకా శక్తి వుంది." అన్నారు.

ధన్య యిబ్బందిగా కదులుతుంటే "ఏంటి ధన్యా నీ సమస్య!" అనునయంగా అడిగారు ఆవిడ.

"సమస్య కాదు మేడం." ధన్య టూకీగా తనకీ, సంజయ్ కీ జరిగిన సంభాషణ చెప్పింది. "సంజయ్ అడిగాక నాకూ ఆ ప్రశ్నకి సమాధానం స్పష్టంగా తెలియదని అర్థమయింది మేడం. డ్యాన్స్ చాలా యిస్తుంది. డబ్బు, కీర్తి, .. మనల్ని యిష్టపడే, గౌరవించే మనుషులు.. యిలా చాలా యిస్తుంది. అయితే వాటిలో నాకేం కావాలనుకుంటున్నానో నాకు తెలియడం లేదు. అవన్నీ నా ఉద్యోగమూ యిస్తుంది. నేను శ్రద్ధ పెడితే అందులోనూ చాలా పై స్థాయి కి వెళ్ళగలను. అలాంటపుడు..."

"కానీ ఇది వేరు కదా ధన్యా!" ధన్య మాటలని మధ్యలో ఆపుతూ అంది దీప. "డ్యాన్స్ నీకిచ్చే అనందం వేరు కదా!"

"అవును మేడం! డ్యాన్స్ చేస్తుంటే నాకు బాగుంటుంది. చాలా ఆనందంగా వుంటుంది. కానీ ఆ ఆనందం నేను సృష్టించుకుంటున్నదా! లేక నాట్యం నాకు సృష్టించి యిస్తోందా! నేను సృష్టించుకుంటున్నదయితే దానిని నేను ఏ పనిలో నయినా సృష్టించుకోవచ్చు కదా! నా వుద్యోగం లోనూ, గృహిణిగా నా బాధ్యతలలోనూ కూడా ఆ ఆనందాన్ని పొందవచ్చు కదా!"

దీప ఒక్క క్షణం ఆలోచిస్తున్నట్లుగా వుండిపోయింది. "నా ఉద్దేశ్యం ప్రకారం మిగతా వాటిల్లో ఆనందాన్ని పొందేందుకు కూడా డ్యాన్స్ హెల్ప్ చేస్తుంది ధన్యా! నాట్యం ఏకాగ్రతని పెంచుతుంది. నాకైతే నాట్యం చేసేటపుడు ఇంకే సమస్యలూ, బాధలూ గుర్తు రావు." అంది.

"అదే మేడం... ఆ స్థితి.. ఏ సమస్యలూ, బాధలూ మనల్ని తాకని స్థితి.. మరో ఆలోచన మనకి రాని స్థితి.. దానిని కళలు మాత్రమే యివ్వగలవా! మామూలు పనులు యివ్వలేవా!

"సంజయ్ నిన్న ఆప్రశ్న అడిగినపుడే నాకు స్ఫురించింది.. ఏ కళలూ రాకపోయినా చాలా ఏకాగ్రతతో వుండేవారు మనకి కనిపిస్తూనే వుంటారు. వాళ్ళు ఏ పని చేస్తున్నా చాలా అందంగా, నైస్ గా అనిపిస్తుంది. ఒక మీటింగ్ కి రావడం.. కూర్చోవడం.. లేవడం.. పెన్ను బ్యాగులో నుంచి తీయడం.. పెట్టడం.. ఒక విషయాన్ని వివరించడం.. అతి చిన్న పని నుంచి పెద్ద పని దాకా.. అన్నీ చాలా నైస్ గా చేస్తున్నారనిపిస్తుంది. ఈ పనిని ఇంత బాగా చేయచ్చా.. ఇంత సింపుల్ గా చేయచ్చా అనిపిస్తుంది. మనమెంతో కాంప్లికేట్ అనుకున్న విషయాన్ని వాళ్ళు అలవోకగా.. అవలీలగా.." ధన్య ఎలా చెప్పాలో అర్థం కానట్లు తడుముకుంటుంటే..

"ఒక హేలగా చేస్తారు." దీప నవ్వుతూ పూర్తి చేసింది.

"కరెక్ట్ మేడం.. కరెక్ట్. నాకు ఆ మాట రాలేదు." అంది ధన్య.

"బహుశా దాన్నే కళాత్మకత అంటారేమో!" సాలోచనగా అంది దీప.

క్షణం తర్వాత కుర్చీలో వెనక్కి వాలుతూ మళ్ళీ తనే అంది. "కళాత్మకత అన్న పదం సరైనదో కాదో నాకు తెలియదు కానీ నువ్వు చెప్పేది నాకు అర్థమయింది ధన్యా. క్లారిటీ ఆఫ్ మైండ్. ప్రతి విషయమూ క్లియర్ గా తెలిసినవాళ్ళు.. మైండ్ లో అస్పష్టతా, కంఫ్యూసనూ లేని వాళ్ళు చేసే పనిని చూస్తున్నపుడు మనకి అలా అనిపిస్తుంది. అయితే అలాంటి స్పష్టత ఆ వ్యక్తిలో ఉంటుందా.. లేక ఆ పని వాళ్లకి ఆ శక్తిని యిస్తుందా అని కదా నీ ప్రశ్న!"

ధన్య తల వూపింది.

"కొందరికి స్వతహాగా వుండవచ్చు. కానీ ప్రయత్నించి అలవరచుకోవాలనుకుంటే మాత్రం నాకు తెలిసినంత వరకూ నాట్యమూ, సంగీతమూ ఆ శక్తిని యిస్తాయి. ఎందుకంటే సంగీత నాట్యాల మూలం వేదాలలో వుంది. వేదం అంటే.. అది అపౌరుషేయం. అంటే ఎవరో ఆలోచించి వ్రాసినది కాదు. భగవంతుని నిశ్వాసమే.. ఇంకా చెప్పాలంటే భగవంతుని ప్రాణమే వేదం. కనుక ఆలోచనకి అతీతమైన స్థితికి వెళ్ళడానికి అవి ఉపయోగపడతాయి. ఏ పని చేస్తున్నపుడు అది మాత్రమే మన ధ్యాసలో వుండడం.. మిగతావేవీ మనసులోకి రాకపోవడం.. అదే ఆనందానికి కీలకం.

"నామటుకు నాకు అది నాట్యంలో దొరికింది. నాట్యం చేస్తున్న సమయంలో నా మనసులో నాట్యం తప్ప మరేమీ వుండదు ధన్యా! వుండకూడదు. వుండకపోతేనే పర్ఫెక్షన్ సాధ్యమవుతుంది. అప్పుడే ఆ కళలో ఒక ఉన్నత స్థానాన్ని చేరడం జరుగుతుంది."

అర్ధమయినట్లుగా తల వూపింది ధన్య. "థ్యాంక్యూ మేడం. వెళ్ళొస్తాను" లేచి నిల్చుంటూ చెప్పింది.

"మంచిదమ్మా.. వెళ్ళిరా." ఆవిడ కూడా నవ్వుతూ చెప్పారు.

తలుపు వైపు నడవబోతూ ఒక్క క్షణం ఆగింది ధన్య. "మీరు చెప్పింది నిజం మేడం. మీరు ఎంతో వేగంగా నర్తిస్తున్నప్పుడు కూడా.. మీ అభినయమూ, అడుగులూ పర్ఫెక్ట్ గా వుంటాయి.. భాసుర భుజబల రణశూరా... నారీజన మానస చోరా.. మహా మేరు సమాన ధీరా.. అంటూ వేగంగా పాట సాగుతూంటే అంత వేగంగానూ విభిన్న భావాలు అలవోకగా మన మొహంలో పలికినపుడు.. ఆవేగం.. ఆ నేర్పు.. ఆ పర్ఫెక్షన్ సాధించినపుడు.. ఆలోచనలకతీతమైన ఒక ఆనందమయ స్థితి మనకి కలుగుతుంది. అదే నాట్యం మనకి యిచ్చే.. నాట్యం నుంచి మనం పొందగలిగే గొప్ప ప్రయోజనం. అంతేకదా మేడం!"

ధన్య ఆ మాట చెప్తూ ఉంటే దీప మొహంలో గబగబా రంగులు మారాయి. "ధన్యా, ఆగు." అంది కంగారుగా.

తలుపు తీసుకుని బయటకు అడుగు పెట్ట బోతున్న ధన్య ఆశ్చర్యంగా వెనక్కి తిరిగింది.

"నీకు ఒక పని చెప్తాను. చేస్తావా!"

"ఏంటి మేడం!"

"నిన్ను ఒకరి దగ్గరికి పంపుతాను. వెళ్ళి ఆమెని కలవాలి."

"ఎవర్ని మేడం! ఎందుకు?" ధన్య ఆశ్చర్యంగా అడిగింది.

"చెప్తాను. కూర్చో" పేపరూ, పెన్నూ చేతిలోకి తీసుకుంటూ చెప్పింది దీప.

లెటర్ వ్రాసి ధన్య చేతిలో పెడుతూ "బహుశా నేను నీకు యిచ్చింది పూర్తి సమాధానం కాదు ధన్యా! ఒకసారి వెళ్ళి ఈవిడని కలువు నువ్వు!" అంది.

ఆలోచనలలోనుంచి తెప్పరిల్లి రుక్మిణి వైపు చూసింది ధన్య. ఒక్క క్షణం ఆవిడ మొహంలోకే తదేకంగా చూసి ఆ తర్వాత పిల్లలవైపు తిరిగింది.

అంతే. కొయ్యబారిపోయింది. అక్కడ.. అక్కడ.. పిల్లలతోపాటూ బాలకృష్ణుడు నాట్యం చేస్తున్నాడు.

రుక్మిణి గారు చిరునవ్వుతో వాడి వైపే చుస్తూ తల వూపుతున్నారు. ధన్య నివ్వెరపోయి చూస్తూండగా పాఠం పూర్తయింది.

పిల్లలందరూ వెళ్ళిపోయారు. క్రింద కూర్చుని వున్న రుక్మిణి గారు మెల్లగా పైకి లేస్తున్నారు "కృష్ణా" అంటూ.

ధన్య మళ్ళీ ఉలిక్కిపడింది. ఎదురుగా బాలకృష్ణుడు కనిపిస్తున్నాడు. ఆమె చేతిలోనుంచి నట్టువాంగం తాళాలు, చిడతా, కర్రా అందుకుని ఆమె ప్రక్కనే బుడిబుడి నడకలతో నడుస్తున్నాడు.

పరుగెత్తినట్లుగా అటు నడిచింది ధన్య. దగ్గరగా వెళ్ళి చూస్తే.. కృష్ణుడు లేడు. రుక్మిణి గారే వాటిని అక్కడ వున్న అలమర లో పెట్టి వంటగదిలోకి వెళ్తున్నారు!

ఆ రాత్రి భోజనాలయ్యాక మెల్లగా వాకిట్లోకి నడిచి దీప కి ఫోన్ చేసింది ధన్య.

"చెప్పు ధన్యా!"

"మేడం! నేను రుక్మిణి గారిని కలిశాను. నాకేమీ చెప్పలేదీవిడ ఇంతవరకూ. ఏం చేయను? రేపు ప్రొద్దున బయల్దేరి వచ్చేయనా!"

"ఏం అక్కడ బాలేదా నీకు! రుక్మిణి గారు నచ్చలేదా!" చిరునవ్వుతో అడిగింది దీప, రుక్మిణి గారు అన్న మాటని వత్తి పలుకుతూ.

"అయ్యో! బాగోక పోవడమా! ఎంత బాగుందో చెప్పలేను. ఎప్పటికీ ఇక్కడే ఉండిపోవాలనిపిస్తోంది. రుక్మిణి గారయితే.. రుక్మిణి గారయితే.." మాటలు రానట్లుగా ఆగిపోయింది ధన్య.

"అర్ధమయిందిలే" దీప నవ్వింది. "మరింకేం! వుండు రెండు రోజులు."

"అది కాదు మేడం! మీరు ఆవిడకి ఏం వ్రాశారు ఉత్తరంలో! నేనెందుకు వచ్చానో మీరు వ్రాశారా! నేను చెప్పాలా! నాకు ఆమెతో ఏం మాట్లాడాలో, ఎలా మొదలు పెట్టాలో తెలియడం లేదు."

"నువ్వేం మాట్లాడకు. రెండు రోజులలో నేనూ వస్తానక్కడికి. అప్పటివరకూ వుండు. ఇద్దరం కలిసి వచ్చేద్దాం."

“మీరొస్తారా..!” ఆశ్చర్యంగా అడిగింది ధన్య. “రెండ్రోజులు నేనేం చేయను మేడం ఇక్కడ!”

“ఏం చేయద్దు. రుక్మిణి తో వుండు. ఆవిడ ఏమన్నా నేర్పితే నేర్చుకో.”

“ఏమన్నా అంటే! డాన్సా!”

“ఏం నేర్పితే అది.” దీప నవ్వి ఫోన్ పెట్టేసింది.

ధన్య మెల్లగా లోపలికి నడిచింది. అక్కడ ఆయన మంచం మీద పడుకుని వున్నారు. ప్రక్కనే నేల మీద చాప పరుచుకుని రుక్మిణి గారు పడుకుని ఉన్నారు. ఆవిడ సన్నగా భాగవత పద్యాలు పాడుతూంటే.. ఆయన కళ్ళు మూసుకుని వింటున్నారు.

ధన్యని చూడగానే “నువు లోపలి గదిలో పడుకోమ్మా!” అన్నారు రుక్మిణి గారు.

ధన్య మెల్లగా మధ్య గదిలోకి వచ్చి తన కోసం రుక్మిణి గారు వేసి ఉంచిన మంచం మీద కూర్చుంది. ముందు గదిలోనుంచి మధురంగా వినిపిస్తున్న ఆవిడ గొంతు వింటూ నిద్రలోకి జారుకుంది.

★★★

తెలతెలవారుతూండగానే మెలకువ వచ్చింది ధన్యకి.

ఓరగా వేసి వున్న తలుపుల లోనుంచి ముందు గదిలో వాల్చి వున్న మంచం కనిపించింది. వాళ్ళకి నిద్రాభంగం కాకూడదని మెల్లగా లేచి శబ్దం రాకుండా వెనుకవైపు వంటగదిలోకి నడిచింది.

నిశ్శబ్దంగా పెరట్లోకి వెళ్ళి మొహం కడుక్కుంది. ఇంకా పూర్తిగా సూర్యుడు ఉదయించలేదు. ఆ చిరువెలుతురునీ, చల్లదనాన్నీ ఆస్వాదిస్తూ మెల్లగా ఇంటి ముందు వైపుకి రాబోయిన ధన్య అలాగే నిలబడిపోయింది.

అక్కడ.. కొంచెందూరంలో రుక్మిణి గారు బావిలో నుంచి నీళ్ళు తోడుతున్నారు. అలసటో.. అలవాటో.. ఆనందమో అర్థంకాని గొంతుతో మధ్య మధ్య “కృష్ణా!” అంటున్నారు.

ఆప్రక్కనే.. ఆప్రక్కనే.. బావి గట్టు మీద కూర్చుని.. రెండు కాళ్ళూ ఆడిస్తూ.. బాలకృష్ణుడు .. ఆవిడతో కబుర్లాడుతున్నాడు!

ఆ దృశ్యం కొంత అలవాటయిన దానిలా చిరునవ్వుతో చూసింది ధన్య. మెల్లగా ఆవిడ దగ్గరికి నడిచి చేతిలోనుంచి చేద అందుకుంటూ "నేను తోడనాండీ!" అంది.

"అపుడే లేచావా!" అన్నారు ఆవిడ వెనక్కి తిరిగి నవ్వుతూ. "క్రొత్త చోటు కదా! నిద్ర పట్టలేదా!

"అదేం కాదండీ." అంది ధన్య చిన్నగా నవ్వుతూ. " రోజూ ఇదే టైం కి లేస్తాను నేను."

ధన్య చీర పైకి దోపుకుని నీళ్ళు తోడి వాకిట్లో ముగ్గు వేస్తుంటే.. "బాగా చదువుకున్న పిల్లవంటే యిలాటివన్నీ రావేమోననుకున్నాను." అన్నారు రుక్మిణి గారు మురిపెంగా చూస్తూ.

"చదువు సమర్ధతని పెంచాలి గానీ తగ్గించకూడదు కదండీ." అంది ధన్య.

రుక్మిణి ఫక్కున నవ్వి ధన్య చుబుకాన్ని పుణుకుతూ "బాగా చెప్పావు." అంది.

ఆవిడ వంట గదిలోకి వెళ్తుంటే ఆవిడ వెనుకే లోపలికి వెళ్తూ.. "నాకు..నాకు.. మీరేదైనా నేర్పితే నేర్చుకోమన్నారు నన్ను దీపా మేడం." అంది ధన్య.

గలగలా నవ్వారు రుక్మిణి గారు. "అలాగేలే" అన్నారు.

పనవగానే వేణుగోపాల స్వామి గుడికి తీసుకు వెళ్ళారు. దర్శనం చేసుకుని మెట్ల మీద కూర్చున్నారిద్దరూ. "ఎంత బాగుందండీ ఈ గుడి!" అంది ధన్య పరవశంగా చూస్తూ.

గుడికి రంగులూ.. నేల మీద ముగ్గులూ వేస్తూండటాన్ని ధన్య ఆసక్తిగా గమనిస్తూంటే "ఎల్లుండి పండగ కదా.. కృష్ణాష్టమి బాగా చేస్తారిక్కడ. ఎక్కడెక్కడి నుంచో వస్తారు జనం. దీప కూడా వస్తుంది ప్రతి సంవత్సరమూ. మా పిల్లలు చేసే నాట్యం చూడటానికి." అంటూ వివరించిందావిడ.

"అవునా!" అంది ధన్య ఆశ్చర్యంగా. "నేను కూడా చేయచ్చా!" బెరుకుగా అడిగింది. "చేయాలనిపిస్తోంది.. స్వామి ముందు"

రుక్మిణిగారు ధన్య బుగ్గ మీద చిన్నగా తట్టారు. "ఎందుకు చేయరాదూ! తప్పకుండా చేయచ్చు."

"మరి.. మరి.. మీరు నాకేమైనా నేర్పుతారా ఈ రెండురోజులలో!"

ఆవిడ చిన్నగా నవ్వుతూ పైకి లేచారు. "పద, వెళ్దాం." అన్నారు.

★★★

ఆరోజూ.. ఆ మర్నాడూ.. అనుక్షణమూ ఆవిడని గమనిస్తూ ఉండి పోయింది ధన్య.

'ఆవిడ దినచర్య.. పూజ.. పతి సేవ.. ఏది చూస్తుంటే అది.. ప్రతీదీ ఒక నాట్యం లా వున్నాయి. కళ్ళు తిప్పుకోలేని ప్రదర్శనలా వున్నాయి. దీపా మేడం అన్నట్లు అంతా ఒక హేల గా వున్నాయి.'

అంతకన్నా ముఖ్యంగా యిక్కడికి వచ్చినప్పటినుంచీ తనకి కలుగుతున్న భ్రమలు మరింత చిత్రంగా వున్నాయి ధన్యకి.

రుక్మిణి గారి ప్రక్కనే సదా బాలకృష్ణుడు నడుస్తున్నట్లుగా అనిపిస్తోంది. ఆవిడ కృష్ణా అన్నప్పుడల్లా  బాలకృష్ణుడి రూపు స్పష్టంగా కళ్ళ ముందు కనిపిస్తోంది. ఆవిడ కాఫీ కలుపుతూ కొంచెం ఎత్తులో వున్న పంచదార డబ్బా కోసం చేయి చాస్తూ "కృష్ణా" అంటే.. అది అలవోకగా ఆవిడ చేతికి అందినట్లు అనిపిస్తుంది. కాదు.. కాదు.. ప్రక్కన గట్టు మీద నిలుచున్న బాలకృష్ణుడు దాన్ని ఆమె చేతికి అందించినట్లనిపిస్తుంది. మజ్జిగ చిలుకుతుంటే ఆవిడ భుజాలు పట్టుకుని అతను వూగుతున్నట్లు తోస్తుంది.

భర్తకి భోజనం వడ్డిస్తుంటే.. అమె కొంగు పట్టుకుని ఆమె తో పాటే అటూ యిటూ నడుస్తున్నట్లు కనిపిస్తుంది.

ఆవిడ తనకి నాట్యం నేర్పుతుంటే.. ఆవిడ ప్రక్కనే కూర్చుని ఆవిడతో పాటూ  అతను కూడా తన నాట్యాన్ని నిశితంగా చూస్తున్నట్లే వుంది!!

రెండో రోజు రాత్రి నిద్రకి ఉపక్రమించబోతూండగా సంజయ్ దగ్గర నుంచి ఫోన్.

గబగబా వాకిట్లోకి నడిచింది ధన్య.

"ఏంటి? ఏమయిపోయావు రెండు రోజులనుంచీ? ఒక ఫోన్ లేదు. మెసేజ్ లేదు. నేను చేస్తే జవాబు లేదు!"

"సారీ సంజయ్. మధ్యాహ్నమంతా ఫోన్ చార్జ్ లో లేదు. ఇప్పుడే చార్జ్ చేశాను. నీ మెసేజ్ చూశాను. పడుకునేలోపల చేద్దాంలే అనుకున్నాను, ఈ లోపల నువ్వే చేశావు."

"ఏంచేస్తున్నావు ఆ పల్లెటూర్లో అంత బిజీగా!"

"డాన్స్ నేర్చుకుంటున్నా." అల్లరిగా చెప్పింది ధన్య. "రేపు సాయంత్రం ప్రోగ్రాం వుంది!"

"ప్రోగ్రామా! అక్కడా!" సంజయ్ ఆశ్చర్యంగా అడిగాడు.

"ఊ. వస్తావా!" మరింత అల్లరిగా అడిగింది ధన్య. "దీపా మేడం కూడా వస్తున్నారు."

"చాల్లే.. ముక్కూ మొహం తెలీని వాళ్ళింటికి నువ్వెళ్ళిందే ఎక్కువ. నేను కూడా వచ్చి వాళ్ళ నెత్తి మీద ఎక్కనా!" సంజయ్ చిరుకోపంగా అన్నాడు.

"వాళ్ళ నెత్తి మీద ఎక్కడం ఎందుకు? పొద్దున్నే ఏ పదింటికో బయల్దేరు నీ కార్లో. సాయంత్రానికి ఇక్కడికి వస్తావు. డాన్స్ అయిపోగానే మళ్ళీ రాత్రికి బయల్దేరి వెళ్ళిపోవచ్చు. నేనూ నీతో వచ్చేస్తాను."

సంజయ్ మాట్లాడలేదు.

"ప్లీజ్ సంజయ్, రావూ! అలా బావుంటుంది కదా! ఇబ్బందేం వుంది చెప్పు. రేపెలాగూ ఆదివారం. సెలవే కదా!"

"సరే, చూస్తాను."

"చూస్తాను కాదు. రా. అన్నట్లు ఓ పని చేయరాదూ.. దీపా మేడం కూడా రేపు పొద్దున బయల్దేరుతున్నారు. ఆవిడ్ని కూడా నీతో పాటు తీసుకొచ్చేయరాదూ! మళ్ళీ ఇద్దరూ విడివిడిగా రావడం ఎందుకు?"

"ఆలోచిస్తాలే."

"ఆలోచిస్తాను కాదు. నువు వస్తున్నావు. అంతే. దీపా మేడం నంబర్ ఎస్.ఎం.ఎస్. చేస్తున్నా. ఆవిడతో మాట్లాడు." ఫోన్ కట్ చేస్తూ చెప్పింది ధన్య.

★★★

"బాగా లేట్ అయిపోయింది కదా! ప్రోగ్రాం టైం కి అందుకోగలమంటారా! ఈ వర్షం యింత యిబ్బంది పెడుతుందనుకోలేదు." డ్రైవ్ చేస్తూన్న సంజయ్ కొంచెం కంగారు ధ్వనించే గొంతుతో అడిగాడు.

"చూద్దాం. ఇంక ఇపుడు చేయగలిగిందేమీ లేదు కదా! ఎప్పటికి వెళ్ళగలిగితే అప్పటికే వెళ్దాం." నింపాదిగా చెప్పింది ప్రక్కనే కూర్చున్న దీప.

“మీరు ధన్యని ఇంత ప్రత్యేకంగా ఈ మారుమూలకి ఎవరి దగ్గరికి పంపారో చూడాలని నాకూ  కుతూహలంగా అనిపించింది. అందుకే ధన్య చెప్పగానే బయల్దేరి వచ్చేశాను.” సంజయ్ నవ్వుతూ చెప్పాడు.

దీప కూడా నవ్వింది. “ఆమె పేరు రుక్మిణి.  ఇద్దరం ఒకే గురువు వద్ద నాట్యం అభ్యసించాం.”

సంజయ్ ఆసక్తిగా చూడటం గమనించి దీప కొనసాగించింది. “ఎనిమిదేళ్ళు కలిసి నేర్చుకున్నాం. ఇద్దరం పోటాపోటీగా చేసేవాళ్ళం. శ్రద్ధలో కానీ సాధనలో కానీ ఇద్దరం సమానంగానే వుండేవాళ్ళం. మా మధ్య పోటీ వుండేది కానీ ఈర్ష్యాసూయలు వుండేవి కావు. ఆ పోటీ అయినా చూసేవాళ్ళ దృష్టిలోనే. మా మనసుల్లో లేదు. ఇద్దరం కలిసే ప్రదర్శనలిస్తూండేవాళ్ళం. ఒకసారి ఒక పోటీకి ఇద్దరం కలిసే వెళ్ళాం.

ఇద్దరమూ కృష్ణుడికి సంబంధించిన పాటనే అభినయించాం. న్యాయనిర్ణేతలు చాలాసేపు తర్జనభర్జనలు పడ్డాక ఫలితాలు చెప్పారు. నాకు ప్రథమ బహుమతి. దానికి ద్వితీయ బహుమతి.”

“ఓ” అన్నాడు సంజయ్ కొంత ఆశ్చర్యంగా, కొంత ఆనందంగా.

“అది మనసులో ఏమనుకుందో నాకు తెలీలేదు. నాకు మాత్రం ఒక ప్రక్కన ఆనందంగా వున్నా మరొక ప్రక్కన బాధగా అనిపించింది. తిరిగి వచ్చేటపుడు దానికి నాట్రిక్ చెప్పేశాను. “నేను నాట్యం చేస్తున్నపుడు ప్రతి క్షణమూ కృష్ణుడిని ఊహించుకున్నానే! కృష్ణుడి వర్ణనలు ఒకటొకటీ వినిపిస్తుంటే అలాగే అతని రూపాలని నా కళ్ళ ముందు ఊహించుకున్నా. శాంతంగా, మోహనంగా, భయంకరంగా.. అలా రకరకాలుగా. బహుశా అందుకే నాకు ఫస్ట్ ప్రైజ్ వచ్చిందేమో!” అన్నాను.

అది నవ్వింది. “అవునా! నేనలా వూహించుకోలేదే!” అంది.

“చూశావా మరి! అందుకే! లేకపోతే నీ నాట్యానికి మాత్రం ఏం తక్కువ! ఈసారి నుంచి నువ్వు కూడా ఆ పని చేస్తే సరిపోతుంది.” అని నేను సముదాయించబోతుండగా అంది అది. “నేను వూహించుకోలేదు. నాకు అలా కనిపిస్తూనే వున్నాడు కృష్ణుడు.. ఎలా పిలుస్తుంటే అలా.. ఎలా కీర్తిస్తుంటే అలా.. ఆ రూపంలో” అంది.

సంజయ్ దిగ్భ్రమగా చూశాడు అ మాటలకి.

దీప కళ్ళల్లో సన్నటి నీటి తెర మెరిసింది. ప్రక్కకి తిరిగి సంజయ్ వైపు చూస్తూ నవ్వింది.

“నాట్యం నాకిచ్చినవి దానికి యివ్వలేదు. దానికి యిచ్చినవి నాకు యివ్వలేదు. మొన్న ధన్య నా దగ్గరికి వచ్చి మాట్లాడినపుడు ఈ సంఘటన గుర్తొచ్చింది నాకు. ధన్యకి నేను సగం సమాధానమే చెప్పాననిపించింది. మిగతాది రుక్మిణి దగ్గర దొరుకుతుందనిపించింది. అందుకే తనని అక్కడికి పంపాను.”

సంజయ్ అలాగే అప్రతిభుడై చూస్తుంటే తల వెనక్కి వాల్చి కళ్ళు మూసుకుంటూ చెప్పింది దీప. “నేను కళలో పరిపూర్ణత కోసం సాధన చేశాను. చాలావరకూ సాధించాను. నాట్యం చేసేటపుడు నాకు నాట్యం తప్ప మరేమీ వుండదు. కానీ.. రుక్మిణికి.. రుక్మిణికి.. ఆ నాట్యం కూడా వుండదు. బహుశా.. తాను నర్తిస్తున్నానన్న స్పృహ కూడా వుండదు. ఆ స్థితిని నేను ఊహించగలుగుతున్నాను. కానీ ఈ జన్మలో సాధించలేకపోయాను.”

★★★

ఆరోజే కృష్ణాష్టమి. రుక్మిణి గారు పూలతో దేవుడి మందిరాన్ని చక్కగా అలంకరిస్తుంటే చూస్తూ కూర్చుంది ధన్య. ఆవిడ భర్త కొంచెం దూరంలో గుమ్మం దగ్గరగా కుర్చీలో కూర్చుని ఏదో చదువుకుంటున్నారు. ఒక కంటితో రుక్మిణి గారి పూజా కార్యక్రమాన్నీ గమనిస్తున్నారు.

కనకాంబరాలతో అందంగా కట్టిన ఒక పెద్ద మాలా, మరో చిన్న మాలా ధన్య చేతుల్లో పెట్టారావిడ.

ధన్య లేచి యివతలికి వచ్చింది. రెండు చేతులూ నడుము మీద పెట్టుకుని చిరునవ్వుతో చూస్తున్న కృష్ణుడి మెడలో ఒక మాల వేసి మరో మాల జడలో తురుముకుంటూ వెనుదిరిగి చూస్తే, ఆవిడ సన్నగా ఏదో పాడుతూ తల వూపుతుండడం కనిపించింది. మళ్ళీ అదే భ్రమ.. రెండు చేతులూ ఆవిడ మెడ చుట్టూ వేసి ఆవిడ వీపు మీద పడి చిన్ని కృష్ణయ్య వూగుతున్నట్లూ.. తన చిట్టి చేతులతో ఆవిడ గడ్డం పట్టుకుని మారాముగా ఏదో అడుగుతుంటే.. ఆవిడ చిరునవ్వుతో తల అడ్డంగా వూపుతున్నట్లూ..

మరింత స్పష్టంగా.. కళ్ళెదుట నిజంగా జరుగుతున్నట్లుగా కనిపిస్తోంది.

ఒక వివశత్వం తనని చుట్టేయగా ఒక్కసారిగా నేలమీద చతికిల బడిపోయింది ధన్య.. ఆయన కుర్చీకి దగ్గరగా.

ఆయన ఉలికిపాటుగా చూశారు. ఆమె తల మీద చేయి వేస్తూ "అమ్మాయీ!" అన్నారు కొద్దిగా వణికే గొంతుతో.

ధన్య తలెత్తి చూసింది. మొహమంతా చిరు చెమటలు కమ్ముకున్నాయి. కళ్ళల్లోంచి నీళ్ళు కారుతున్నాయి.

ఆయన ఆశ్చర్యంగా చూస్తుంటే గద్గదమైన గొంతుతో "నాకు.. నాకు ఎలాగో వుందండీ." అంది. "అమ్మని చూసినప్పుడల్లా నాకు ఆమె ప్రక్కన బాలకృష్ణుడు స్పష్టంగా కనిపిస్తున్నాడు. ఇక్కడికి వచ్చినప్పటినుంచీ అదే భ్రమ."

అప్పటివరకూ కొంచెం కంగారుగా ఆమెనే చూస్తున్న ఆయన నవ్వేశారు. "అదా...!" అన్నారు.

ఆమె తల మీద మీద నుంచి చేయి తీసేస్తూ.. ఒక ముసిముసి నవ్వుతో కుర్చీలో కొద్దిగా వెనక్కి సర్దుకుని "అది నీ భ్రమ కాదు.. ఆవిడ మాయ." అన్నారు.

ధన్య ఆశ్చర్యంగా చూసింది. "అంటే.. అంటే.. మీక్కూడా కనబడతాడా కృష్ణుడు ఆవిడ ప్రక్కన!" అంది ఉద్విగ్నంగా.

"కృష్ణుడా.. ఆ.. కనబడతాడు... ఆవిడ కొంగుకు కట్టుకు తిరుగుతున్న లక్షణాలన్నిటికీ ఓ రూపం యిస్తే అది కృష్ణుడేగా మరి!" అన్నారు మరింత విశాలంగా నవ్వుతూ.

ధన్య కళ్ళముందు ఏదో మెరుపు మెరిసినట్లయింది.

"అంటే!?"

"ధర్మం.. ప్రశాంత చిత్తం.. సత్యం.. జ్ఞానం.. ఆనందం.." ఒక్కొక్క మాటనీ విడదీసి వివరిస్తున్నట్లుగా పలికారు ఆయన.

ఆ అద్భుతాన్ని అవగాహన చేసుకునేందుకు ప్రయత్నిస్తూ రెండు క్షణాలు అలాగే శిలాప్రతిమలా వుండిపోయింది ధన్య. ఆ తర్వాత స్థిమితపడి.. తగ్గిన హృదయ వేగంతో "అవును" అంది.

క్షణం తర్వాత మళ్ళీ "నిజమే" అనుకుంది చిరునవ్వు మెరిసే పెదవులతో.

తలెత్తి మరోసారి తన్మయంగా ఆవిడవైపు చూస్తూ "ఎలా సాధించారండీ అమ్మ యిది!" అంది తనలో తనే అనుకుంటున్నట్లుగా.

“ఏముందమ్మా! ఒకసారి ఆనందమంటే ఏమిటో తెలిశాక యిక దాన్ని వదిలిపెట్టకుండా పట్టుకుంది. అంతే. సింపుల్.” ఆయన గుంభనగా నవ్వారు.

‘అంతేనా! అంత సింపులా!’ ధన్య ఆశ్చర్యంగా అనుకుంది. “అయితే మరి అది అందరికీ ఎందుకు సాధ్యం కావడం లేదండీ?” ఆయన నవ్వుని చూసి కొంచెం ఉడుక్కున్నట్లుగా అడిగింది.

“ఆ రహస్యమే కదమ్మా నువ్వు యిప్పుడు తెలుసుకోవలసింది!” గంభీరంగా అన్నారు ఆయన.

ధన్య కళ్ళు విప్పార్చుకుని చూసింది.

“ఆనందం అంటే ఏమిటో గుర్తుపట్టే అవకాశం నీకు నీ కళ యిచ్చింది. దానిని నిలబెట్టుకునే చాతుర్యం.. పెంచుకునే సామర్థ్యం నీ జీవనశైలి యివ్వాలి.”

‘అది నాకు సాధ్యమేనా.. నేను సాధించగలనా!’ అన్నట్లు చూస్తున్న ధన్య మనసుని అర్థం చేసుకున్నట్లుగా చెప్పారాయన. “అలౌకికానందాన్ని అందుకోవడం ఒక ఎత్తు.. దానిని కళ ద్వారా మరొకరికి అందివ్వగలగడం ఒక ఎత్తు. మనసు, బుద్ధి, దేహం – ఒక్కొక్కరికి ఒక్కొక్కటి ప్రతిబంధకం కావచ్చు. కానీ నువు రెండూ చేయగలవు. ఆ సంస్కారమూ, రూపమూ, కళా నైపుణ్యమూ – అన్నీ ఉన్నాయి నీకు. ఇంకా పెంచుకోగల శక్తీ ఉంది. కనుక నువ్వు ఇహమూ, పరమూ కూడా సాధించగలవు.”

ఆయన సన్నటి గొంతుతో మెల్లగా, బుజ్జగిస్తున్నట్లుగా చెప్తూంటే రుక్మిణి గారు చిరునవ్వుతో వచ్చి ఆయన ప్రక్కన నిలబడ్డారు. “నాట్యంతో ధనమూ, కీర్తి సంపాదించుకోవచ్చు. సమాజోద్ధరణ చేయచ్చు. ఆత్మోద్ధరణా చేసుకోవచ్చు.” అన్నారు.

వాళ్ళిద్దరినీ చూస్తుంటే ధన్య గుండెల్లో ఆనందం పొంగింది. ఒక్క ఉదుటున లేచి యిద్దరి పాదాలకూ భక్తిగా నమస్కరించింది.

★★★

హడావుడిగా కారు ఆపి వేగంగా గుడి వైపు నడిచారు దీపా, సంజయ్.

“ప్రోగ్రాం అయిపోయిందేమో! వెళ్ళిపోయుంటారా వీళ్ళు!” సంజయ్ ప్రశ్నకి జవాబు చెప్పలేనట్లు చూసింది దీప.

సరిగ్గా వాళ్ళు గుడిలో అడుగు పెడుతూండగా వినిపించింది.. రుక్మిణి గారి శిష్యురాళ్ళచే ఆనాటి కార్యక్రమంలోని ఆఖరి అంశం ప్రదర్శింపబడుతుందన్న ప్రకటన.

వెనువెంటనే అయిదుగురు అమ్మాయిలు మండపం లోకి ప్రవేశించారు. అటు యిద్దరూ.. యిటు యిద్దరూ.. మధ్యలో ధన్య...

అది చూసి, ఉన్న చోటనే ప్రతిమల్లా ఆగిపోయారు దీపా, సంజయ్. నాట్యం మొదలయింది.

అయిదుగురు గోపికలు.. ఆడుతూ పాడుతూ కొలనులోకి దిగారు. కిలకిలనవ్వులతో జలకాలాడుతున్నారు.

అంతలో ఎక్కడి నుంచో మురళీరవం. అదిగో కృష్ణుడు! అయ్యో వాళ్ళు చూడరే ఆ అల్లరివాడిని!... వాళ్ళ దుస్తులన్నీ దాచేస్తున్న కొంటెవాడిని!...

అదీ..ఇప్పుడు వెతుక్కుంటున్నారు.. కృష్ణుడి కోసం కాదు..! వాళ్ళ దుస్తుల కోసం..!!

కంగారు పడుతున్నారు.. కాళిందీ తీరమంతా కలయ తిరుగుతున్నారు...

అదిగో.. మళ్ళీ మురళీనాదం.. ఈసారి మరింత స్పష్టంగా.. గాలిలో తేలి.. అన్ని దిక్కులా క్రమ్మి.. అందరి హృదయాలనూ అలవోకగా నిమిరి..

అదిగదిగో నల్లనయ్య.. కనిపించాడు.. ఇప్పుడు కనిపించాడు..

అన్ని కళ్ళకీ ఒకేసారి... ఆగమనుతుడు ఆ యమునావిహారి..!

ఉలిక్కిపడ్డారు గోపికలు.. సిగ్గుతో తమని తాము నీళ్ళలో దాచుకున్నారు.. మొదట మర్యాదగా బ్రతిమలాడారు.. అ తర్వాత "రండి, ఇలా వచ్చి మీదుస్తులు మీరు తీసుకోండి" అన్న ఆ ఆకతాయిని చూసి మెటికలు విరచారు.. ఆ అఘాయిత్యానికి బుగ్గలు నొక్కుకున్నారు...

"పోనీ చేతులెత్తి నాకోసారి నమస్కరించండ"న్న చిలిపి వాడిని చూసి నవ్వుకున్నారు.. "నీకా, నమస్కారమా!" అంటూ నొసలు విరిచారు..

కానీ.. కానీ తప్పలేదు. చివరికి పెట్టారు ఓ నమస్కారం విసురుగా... ఒకింత దురుసుగా.

అలా కుదరదన్నాడు ఆ ఘనుడు.

ఇంకేం చేస్తారు! అలా ఎంతసేపుంటారు! ఆనందమనే అయస్కాంతం అంత బలంగా లాగేస్తుంటే, ఎందుకూ పనికి రాని అహాన్ని ఎంతసేపని మోస్తారు!... మురళీరవం వినబడిన

మొదటి క్షణమే ఎగిరి గంతులేయడం మొదలు పెట్టిన హృదయాలని ఎంత సేపని వడిసిపడతారు!! అశక్తులై వదిలేశారు.

అంతే. అందరి మనసులూ రెక్కలొచ్చిన పిట్టల్లా ఎగిరాయి. బంధాలన్నీ తెంచుకుని వెళ్ళి అతని పాదాలమీద వాలాయి. అయిదు జతల చేతులూ అన్నీ మరచి పైకి లేచాయి..!!!

అప్పుడు.. ఆ క్షణం.. ఆ అయిదుగురే కాదు.. అక్కడున్న ఆబాలగోపాలమూ గోపికలే అయ్యారు. అద్వితీయమైన ఆనందాన్ని అరక్షణమే అయితేనేం... పట్టుకున్నారు!

వెలిగిపోతున్న మొహంతో కలలో నడుస్తున్న దానిలా.. సంజయ్ వైపు అడుగులు వేస్తోంది ధన్య. ఆరోజు ఆమె అందుకున్న అనుభవాన్ని ఆమె నోరు తెరిచి చెప్పనక్కరలేదు.. మునిగి వచ్చిన ఆనందార్ణవాన్ని వర్ణించనక్కరలేదు. ఆ ఉధృతి సంజయ్ ఊహకీ, మనసుకీ కూడా స్పష్టంగా అందుతోంది. ఇటు అతని హృదయమూ దాదాపుగా అదే స్థాయి పరవశంలో.. ఆనందాంబరాన్ని తాకొచ్చిన వివశత్వంలో వుంది.

ఆమె సంజయ్ దగ్గరికి వచ్చి ఏదో చెప్పబోతుండగా.. ఒక్కసారిగా వెనుక నుంచి వచ్చిన పిల్లలు ఆమె చేయి పట్టుకుని లాగేశారు "అక్కా, అమ్మ అందరినీ దర్శనానికి రమ్మంటున్నారు, రండి" అంటూ. ఒక కెరటం ఉవ్వెత్తుగా వచ్చి ఒడ్డున వున్న మనిషిని లోపలికి లాగేసినట్లూ, వాళ్ళు ధన్యని లాగేయడమూ.. ఆ జన ప్రవాహంలో ఆమె అలా అలా ముందుకు కొట్టుకు వెళ్ళిపోవడమూ క్షణంలో జరిగిపోయాయి. అరనిమిషం తర్వాత తెప్పరిల్లి సంజయ్ కూడా ముందుకి కదిలాడు. ధన్య వెనక్కి తిరిగి కంగారుగా చూస్తోంది. అతన్ని రమ్మంటూ చేయి వూపుతోంది.

జనాన్ని తప్పించుకుంటూ సంజయ్ ముందుకు వెళ్ళాలని ప్రయత్నిస్తూన్న కొద్దీ..అల్లంత దూరంలో యింకా యింకా ముందుకు సాగిపోతోంది ధన్య. చివరికి ఎలాగైతేనేం అతను ఆమెని చేరుకున్నాడు. అతిప్రయంతం మీద ఆమె చేయి అంది పుచ్చుకున్నాడు.

తన ప్రయత్నం లేకుండా ముందుకు వెళ్ళిపోతున్న ధన్య అతను ఒక్కసారిగా అలా ఆపడంతో ఆ విసురుకి తూలిపడబోయి, కుడిచేయి అతని హృదయం మీద ఆనించి నిలదొక్కుకుంది. ఆ చేయిని అలాగే తన చేతితో పట్టుకుని ఆమె కళ్ళల్లోకి చూసిన సంజయతో మెరిసే కళ్ళతో చెప్పింది "నాకు అర్థమయింది సంజయ్.. నాట్యం నాకేమిస్తుందో!".

సంజయ్ నవ్వాడు. "నాకూ అర్థమయింది.. నాట్యం నాకేమిస్తుందో!" అన్నాడు.

ధన్య ఫక్కున నవ్వింది. ఒక్కసారిగా వాళ్లపై అక్షింతల జల్లు కురిసింది. తుళ్ళిపడి చూసిన వాళ్లిద్దరికీ ఆశీర్వదిస్తున్న అర్చకుడూ... ఆ వెనుకనుంచి చిరునవ్వులు చిందిస్తున్న వేణుగోపాలుడూ ఒకేసారి కనబడ్డారు.

---

For Latest Telugu Books - Visit now:
Kinige.com